

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 19.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:23 (శని)
సహరి : 4:44 (ఆది)

# ఏలూరు మహేష్ యాదవ్‌కే

## ఎంపీ అభ్యర్థిని ఖరారు చేసిన టీడీపీ







ఏలూరు లోక్‌సభ స్థానం టీడీపీ అభ్యర్థిగా పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను ప్రకటించారు. చాలా కాలం నుంచి ఈ స్థానంపై ఒకవైపు టీడీపీ మరోవైపు బీజేపీ మధ్య దోబూచు లాట సాగింది. వీటికి తెర దించుతూ మహేష్ కుమార్‌ను తన అభ్యర్థిగా టీడీపీ ప్రకటించింది. గతంలో ఒక సామాజిక వర్గం నుంచే దశాబ్దాల తరబడి పోటీ జరుగుతున్నా ఈసారి మాత్రం బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలనే క్రమంలో ఏలూరు లోక్‌సభ స్థానాన్ని వారికి కేటాయిస్తూ శుక్రవారం టీడీపీ కీలక నిర్ణయం తీసుకుంది.

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మహేష్‌కుమార్ యాదవ్ మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడుకు స్వయానా అల్లుడు. ఈ నేపథ్యం ఆయనకు బాగా కలిసి వచ్చింది. మహేష్ కుమార్ వ్యాపారవేత్త. కడప జిల్లా మైదుకూరు ఆయన స్వగ్రామం. టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ తనయుడు కూడా. బీసీ వర్గాల్లో యాదవులకు తగినంత ప్రాధాన్యం ఇచ్చే దిశగానే తెలుగుదేశం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నూజివీడు అసెంబ్లీ స్థానం నుంచి కొలుసు పార్థసారథి కూడా యాదవ సామాజిక వర్గానికి చెందినవారే. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఎంపీ స్థానంతో పాటు ఒక అసెంబ్లీ స్థానం టీడీపీ యాదవులకే కేటాయించినట్టు అయింది. మరోవైపు బీసీ సామాజిక వర్గాలు ఈ నిర్ణయాన్ని దాదాపు స్వాగతించాయి. కొన్నాళ్లుగా మహేష్‌కుమార్ యాదవ్‌తో పాటు బీసీ వర్గాలకే చెందిన సత్యనారాయణ గౌడ్, గోరుముచ్చు గోపాల్ యాదవ్ సైతం పోటీ పడినా చివరికి మహేష్ వైపే టీడీపీ మొగ్గు చూపింది. మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు కుటుంబానికి చెందిన వారికి ఎన్నిసీట్లు ఇస్తారంటూ కొంతమేర పార్టీలో గుసగుసలు వినిపించినా బీసీల మద్దతుతో మహేష్ గట్టు ఎక్కడం ఖాయమని ఆ పార్టీ వర్గాలు గట్టి నమ్మకంతో ఉన్నాయి. దెందులూరు, నూజివీడు, కైకలూరు, ఏలూరు నియోజక వర్గాల్లో యాదవ్ సామాజిక వర్గానికి చెందిన ఓటర్ల సంఖ్య గణనీయంగానే ఉంది. వీరందరి మద్దతు కూడకట్టుకోవడమే కాకుండా ఇంకోవైపు యనమల రామకృష్ణుడు ఇమేజ్ ఉభయగోదావరి జిల్లాల్లో ఉండడంతో ఆయనకు కొంత కలిసి వస్తుందంటున్నారు. ఈ మేరకు టీడీపీ అధినాయకత్వం పలుమార్లు వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించి ఆ మేరకే తుదినిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయటానికి ఒకవైపు మహేష్‌కుమార్ యాదవ్‌తో పాటు పోలీస్ ఐజీ సత్యనారాయణగౌడ్ సైతం పోటీ పడ్డారు.



ఏలూరు బీజేపీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు

### వారి విజ్ఞతకే వదిలేస్తున్నా : గోపాల్‌యాదవ్



చాలాకాలం నుంచి ఏలూరు ఎంపీ టిక్కెట్ రేసులో ఉన్న గోరుముచ్చు గోపాల్‌యాదవ్ తనకు అవకాశం దక్కక పోవడంతో శుక్రవారం ఒక వీడియోను విడుదల చేశారు. ఇన్నాళ్ల తనకు ఇస్తానంటూనే ఎక్కడో మైదుకూరులో ఉన్న వ్యక్తికి టిక్కెట్ ఇచ్చారని, దీనికి టీడీపీ విజ్ఞతకే వదిలేస్తున్నానని గోపాల్ యాదవ్ పేర్కొన్నారు. ఇంకోవైపు బీసీలకు ఎంపీ స్థానాల్లో మెరుగైన అవకాశాలు ఇచ్చిన జగన్‌కు ఫ్యాన్ అయిపోయానని ఆయన ధైర్యాన్ని మెచ్చుకుంటున్నానంటూ వ్యాఖ్యలు చేశారు. నెలక్రితం తన భార్య ప్రాణాపాయంతో ఆస్పత్రిలో చేరినప్పుడు తాను రెండురోజుల పాటు సింగపూర్‌లో ఉండాల్సి వచ్చిందని ఈ సమయంలో తన వ్యతిరేక శక్తులు బాగా పనిచేశాయంటూ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలం పాటు ఏలూరు సీటుకోసం ప్రయత్నించడమే కాకుండా వివిధ కార్యక్రమాల్లో యాదవ్ పాలు పంచుకుంటూ వచ్చారు. చివరి క్షణం వరకు ఏలూరు టిక్కెట్ తనదేనంటూ ధీమాతో ఉన్నారు. కాని తెలుగుదేశం అదిష్ఠానం యాదవ్‌ను కాదని మహేష్ కుమార్ వైపు మొగ్గు చూపడంతో గోపాల్ యాదవ్ అనుచరులు కూడా ఖంగుతిన్నారు. రెండురోజుల్లోనే యాదవ్ తగు నిర్ణయానికి సిద్ధమవుతున్నట్టు చెబుతున్నారు.

**ఇప్పటివరకు ఉన్న చిక్కుముడి వీడింది**

**ఇంకోసారి ఆలోచించండి అంటున్న బీజేపీ**

**ఇస్తామంటూనే.. ఇలా చేశారు..**

**గోపాల్‌యాదవ్ ఆవేదన**

**ఇక తేలాల్సింది నరసాపురమే**

### ఏలూరు చిక్కుముడి వీడినా..

ఏలూరు లోక్‌సభ స్థానం ఎవరికి కేటాయిస్తారనే దానిపై కూటమిలో నిన్న, మొన్నటి వరకు ఉత్కంఠ కొనసాగింది. బీజేపీ సైతం మార్పులు, చేర్పులు జరిగి తమకే ఈ సీటు కేటాయిస్తారంటూ ధీమా వ్యక్తం చేయటమే కాకుండా ప్రత్యేకించి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి పోటీ చేయడం ఖాయమని పదేపదే ప్రకటిస్తూ వచ్చారు. కాని వీరి ఆశలను నీరుగారుస్తూ తెలుగుదేశం తన అభ్యర్థిగా మహేష్ కుమార్ యాదవ్‌ను ప్రకటించి ఇప్పటివరకు ఉన్న చిక్కు ముడులను విప్పింది. తెలుగుదేశం అభ్యర్థి ప్రకటన వెలు వడిన కడప నేత వద్దు స్థానిక నేత గారపాటికే సీటు అని బీజేపీ నేతలు ఏలూరు బీజేపీ కార్యాలయంలో నినాదాలతో హోరెత్తించారు. మూడు పార్టీలు ఏలూరు పార్లమెంట్ సీటు విషయంలో పునరాలోచన చేయాలంటూ డిమాండ్ చేశారు. ప్రత్యేకించి 16 ఏళ్లుగా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న తపన చౌదరికి అవకాశం ఇవ్వాలని ఆయనకు అన్ని పార్టీల మద్దతుతో పాటు ప్రజామద్దతు ఉందని, ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గాది రాంబాబుతో సహా, వరప్రసాద్, గుమ్మడి చైతన్య, రామ్‌ప్రసాద్, నాగసురేష్, శ్రీనివాసశాస్త్రి, శివతో సహా నేతలందరూ డిమాండ్ చేశారు. పాత్రికేయుల ముందు తమ వాదనలు వినిపించే ప్రయత్నం చేశారు. టి.నరసాపురం మండలం తిరుమలదేవీపేటలోను మండల బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. పొత్తులో భాగంగా బీజేపీకే ఏలూరు పార్లమెంటు సీటును కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్ల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పీవీఎస్ఎస్ రామలింగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి చాత్రాతి యుగంధర్, సోషల్ మీడియా సెక్రటరీ చిక్కుళ్ళ వెంకటేశ్వర రావు, మండల పార్టీ అధ్యక్షుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.అయితే ఇప్పటికే తెలుగు దేశం కీలక నిర్ణయం ప్రకటించినందున తిరిగి మరోసారి నిర్ణయం పునఃసమీక్ష ఉంటుందా? ఉండదా? అనేదే అందరిలోనూ ప్రశ్న.

### నరసాపురంలో ఏమైంది..?




నరసాపురం లోక్‌సభ స్థానాన్ని, ఇంతకు ముందే ఉమ్మడి పొత్తులో భాగంగా భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. ఈ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారనే దానిపై ఇప్పటికే సందిగ్ధత వీడలేదు. వైసీపీకి రాజీనామా చేసినా సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు ఈ స్థానంలో తిరిగి పోటీ చేస్తారని ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో కూటమిలో భాగస్వాములైన కార్యకర్తలంతా విశ్వసిస్తు న్నారు. బీజేపీ సైతం నరసాపురం లోక్‌సభ, కైకలూరు అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులపై గడిచిన రెండు రోజులుగా ఢిల్లీస్థాయిలో కమలనాథులు కసరత్తు చేస్తున్నారు. వీలైతే శనివారం పార్లమెంటరీ బోర్డు మరోసారి సమావేశమై ఏపీలో ఎంపీ స్థానాలు, అసెంబ్లీ స్థానాలపై ఒక క్లారిటీ ఇవ్వగలరని భావిస్తున్నారు. రఘు రామకృష్ణంరాజు అనుకూలురు మాత్రం ఇప్పటికే భారీ ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. రఘురామకృష్ణం రాజు సైతం తాను పోటీ చేసేది నరసాపురం నుంచేనని క్లారిటీ ఇచ్చారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జేసీ తదితరులు

### ప్రచారాలకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్ సుమిత్

భీమవరం, మార్చి 22 : ఎటువంటి అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 16 తేదీ సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ ఆమలులో ఉందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గాల ఆర్వోల నుంచి 24 గంటల ముందుగా అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కమిటీ నుంచి పర్మిషన్ పొందిన తర్వాతనే ప్రింటింగ్‌ప్రెస్‌ల నుంచి పామ్‌ప్లేట్స్, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు వేయించు కోవాలన్నారు. పర్మిషన్ లెటర్ ఉంటేనే ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యం ప్రింటింగ్ చేయాలన్నారు. ఏప్రిల్ 17వ తేదీవరకు చేసిన ఖర్చులను సంబంధిత పార్టీల ఖాతాలో జమచేస్తామని, అభ్యర్థులు నామినేషన్లు వేసినప్పటి నుంచి అయిన ఖర్చులు సంబంధిత అభ్యర్థి ఖర్చుల్లో రాస్తామని తెలిపారు.

### 26 నాటికి ఫారం- 7,8 లు పరిష్కారమవ్వాలి

ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంటు సిస్టమ్ (ఈఎస్ఎంఎస్)ను పటిష్ఠంగా అమలు చెయ్యాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. పరిశీలనలో ఉన్న ఫారం- 7,8 అన్నింటిని ఈనెల 26 నాటికి పరిష్కరించాలన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సి-విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. కలెక్టరు సుమిత్ కుమార్, జేసీ ప్రవీణ్ ఆదిత్య జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు తదితరులు పాల్గొన్నారు.

### 1 నుంచి పదో తరగతి మూల్యాంకనం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 22 : పదో తరగతి పరీక్షలు జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 1వ తేదీ నుంచి జరగనున్నట్లు డీఈవో వెంకటరమణ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో వీరవాసరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పది మూల్యాంకనం జరగనుంది. దీనికి సంబంధించి సుమారు 900 మంది ఉపాధ్యాయులు విధుల్లో ఉంటారని తెలిపారు. మూల్యాంకనం జరిగే పాఠశాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు బార్ కోడింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఇంకెప్పుడిస్తారు ?

**దాళ్వా కోతలు వస్తున్నా..**

**సార్వా సొమ్ములు అందలేదు ?**

**1400 మంది రైతుల ఎదురుచూపులు**

**ప్రభుత్వ విధానాలతో ఇబ్బందులు**

రైతన్నకు కష్టపడి పంట పండించడం తెలుసు.. కానీ పండించిన ధాన్యం అమ్మి సొమ్ములు చేతిలో పడాలంటే ఎన్ని అవస్థలు పడాలో తెలిసేలా చేసింది మాత్రం వైసీపీ ప్రభుత్వమే. గడిచిన మూడేళ్లలో రైతులను ముప్పుతిప్పలు పెట్టి వరి సాగుకు దూరం చేసేలా ప్రభుత్వ విధానాలున్నాయి. దాళ్వా సాగు ధాన్యం అమ్మే దశలో ఉన్నా ఇంకా సార్వాకు సంబంధించి సొమ్ములు అందని రైతులు ఉన్నారు.

భీమవరం రూరల్, మార్చి 22 : దాళ్వా పంట మాసూళ్ల దశకు వచ్చినా గడిచిన సార్వా పంట ధాన్యం సొమ్ము ఇంకా రైతులకు రాలేదు. రైతుల ఖాతాలలో సొమ్ము జమవ్వలేదు. ఎప్పుడు పడతాయా అయని రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో గత సార్వా పంటలో 4 లక్షల 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు కొనుగోలు చేశారు. పంట ముగిసి నాలుగు నెలలు అవుతుంది. దాళ్వా సాగు మొదలై మూడు నెలలు అవుతుంది. జిల్లాలో 1400 మంది రైతులకు రూ.15 కోట్లు పైగా ధాన్యం సొమ్ములు అందించాల్సి ఉంది. జనవరి 29 నుంచి సొమ్ములు ఆగిపోయాయి. అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది.

### అమ్మాలంటే నానా అవస్థలు

సార్వా పంట ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విధానాలు చాలా ఇబ్బందిగా మారాయి. దీంతో పంట మాసూళ్లయినా ధాన్యం రాసులుగా పోసి నెలలు తరబడి చూడాల్సి వచ్చింది. గడిచిన మూడేళ్ల ఆరు పంటలలో ప్రభుత్వం విధానంలో మద్దతు ధర అనే ప్రచారం తప్ప ఎక్కడా రైతుకు సరైన ధర దక్కలేదు. పైగా మిల్లర్లు బస్తాకు పది కేజీల వరకు కోత కోశారు. ఒక పంటలో అయితే నాలుగు నెలలకు కానీ సొమ్ములు రాలేదు. ధాన్యం సంచులు పొందడంలో అవస్థలు.. ఇలా ఎన్నో కష్టాల మధ్య ధాన్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్మాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.



### అధికారుల చుట్టూ తిరుగుతున్నా..



సార్వా పంట సొమ్ము రాకపోవడం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ధాన్యం అమ్మకం జరిగి నెలలు గడుస్తున్నా సొమ్ము జమ అవలేదు. తుఫాన్ దెబ్బకు దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. ఆ ధాన్యానికి కూడా సొమ్ము రాకపోవడంతో ఏం చేయాలి ? సొమ్ము ఎప్పుడు పడతుందా అని పదేపదే అధికారులు చుట్టూ తిరగాల్సి వస్తున్నది.

-వై.ఆంజనేయులు, రైతు, బాలేపల్లి

### పెట్టుబడులకు అవస్థలు



సార్వా సొమ్ము అందక దాళ్వా పెట్టుబడులకు అవస్థలు పడుతున్నాం. దాళ్వా పంట దాదాపు పొట్ట దశకు చేరుకుంది. సార్వా పంట ధాన్యం అమ్మకం చేసి నెలలు దాటింది. పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ వస్తున్నా. ధాన్యం సొమ్ము అందక నానా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఈ దాళ్వాకు ఏం చేస్తారో ఏమో..సాగు అంటేనే భయమేస్తోంది.

-బొక్కా సత్యనారాయణ, రైతు, వీరవాసరం మండలం

### బెంగళూరు ఎక్స్‌ప్రెస్ పొడిగింపుపై సస్పెన్స్

7







కొల్లేటికోట జలదుర్గా గోకర్ణేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

### కన్నుల పండువగా జలదుర్గా గోకర్ణేశ్వరస్వామి కల్యాణం

కైకలూరు, మార్చి 22 : కొల్లేటికోట పెద్దింటమ్మ కల్యాణ మహోత్సవం గురువారం భక్తుల కోలాహలం మధ్య, వేదపండితుల మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి గోకర్ణపురం నుంచి గోకర్ణేశ్వరస్వామిని పల్లకీపై ఊరేగింపుగా పెద్దింటమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత జలదుర్గా అమ్మవారికి స్వామివారికి వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. వేలాదిమంది భక్తులు కల్యాణం తిలకించారు. ఉదయం అమ్మవారికి నవవరణార్చన, కలశ పూజ, జయాధిహోమం, బలిహరణ, పుష్పాలంకరణ, ధూపసేవ, పంచహారతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, భక్తులకు ఉచిత ప్రసాదాన్ని ఐ.భీమవరానికి చెందిన గొట్టుముక్కల వెంకట సూర్యనారాయణరాజు, సుబ్బలక్ష్మి దంపతులు అందజేశారు.ఈవో గోపాలరావు ఏర్పాట్లను నిర్వహించారు.

# యువ ఓటర్లే కీలకం

**భారీగా పెరిగిన కొత్త ఓటర్లు..**

**కలెక్టరేట్‌కు చేరిన కార్డులు**



భీమవరం టౌన్, మార్చి 22 : సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్ల కీలకం కానున్నారు. గత ఎన్నికల కంటే ఈసారి భారీగానే కొత్తఓటర్లు వచ్చారు. కళాశాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు, ఆన్‌లైన్‌లో నమోదు వంటి అంశాలు కలసి వచ్చాయి. మొన్న డ్రాఫ్ట్ నోటిఫికేన్ నాటికి 13,500 మంది యువ ఓటర్లు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపు అయింది. దాదాపు 34,314 మంది యువ ఓటర్లు నమోదయ్యారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలో ఆచంట నియోజకవర్గంలో 4,312 మంది, పాలకొల్లు 4,657, నరసాపురం 3,917, భీమవరం 5,603, ఉండి నియోజకవర్గంలో 5,293, తణుకు 5,460, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 5,072 మంది కొత్తగా నమోదయ్యారు. ఈ యువ ఓటర్ల ఎటువైపు మొగ్గుచూపుతారో అనేది ఇప్పుడు నియోజకవర్గాల్లో చర్చనీ యాంశంగా మారింది. ఇప్పటికే నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డులను జారీ చేస్తున్నారు. ఇప్పటికే కార్డులు కలెక్టర్ కార్యాలయాలకు చేరడంతో వాటిని పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు. ప్రతీకార్డుపై క్యూఆర్ కోడ్ ఉంటుంది దానిని స్కానింగ్ చేసిన తరువాత మాత్రమే జిల్లా అధికారులు పంపిణీ చేస్తున్నారు. దీనికోసం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఎవరైనా కార్డులు దారులు లేకపోతే తిరిగి వచ్చిన వాటిని బీఎల్‌వోల ద్వారా ఓటర్లకు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఏపీ జట్టు కెప్టెన్‌గా తోలేరు యువకుడు



సీతారామ తేజ

వీరవాసరం, మార్చి 22 : మహారాష్ట్రలో జరుగుతున్న 70వ జాతీయ సీనియర్ కబడ్డీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్‌గా తోలేరు యువకుడు సారథ్యం వహిస్తున్నాడు. పురుషుల కబడ్డీ జట్టుకు వీరవాసరం మండలం తోలేరు గ్రామ యువకుడు తోట కుమార సీతారామతేజ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. సీఐఎస్‌ఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సీతారామతేజ కెప్టెన్‌గా ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తేజ హైస్కూల్ స్థాయిలోనూ కబడ్డీపై మక్కువ చూపాడు. క్రీడల్లో ఉన్న ఆసక్తి కొద్ది కబడ్డీపై ఉత్సాహం చూపుతున్న తరుణంలో తోలేరు పీఈటీ పీఎస్ఎన్ మల్లేశ్వరరావు కబడ్డీలో మెలకువలపై తర్ఫీదు ఇచ్చారు. అండర్-17, అండర్-19 , కబడ్డీలో జాతీయస్థాయిలో ప్రతిభ చూపారు. తెలంగాణలో నిర్వహించిన ప్రొకబడ్డీలో రెండు సీజన్లలోనూ ప్రతిభ చూపారు. సీనియర్ నేషనల్స్‌లో రెండు పర్యాయాలు పాల్గొనగా రెండో పర్యాయం ఏపీ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికై సారథ్యం వహిస్తున్నాడు.

## భవిష్యత్‌లో విద్యుత్ వాహనాలదే హవా



సందీప్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 22 : భవిష్యత్‌లో విద్యుత్ వాహనాలదే హవా అని ప్రిన్సిపాల్ ఇంజనీర్ లైట్ ఆన్ (సింగపూర్) డాక్టర్ మడిశెట్టి సందీప్ తెలిపారు. ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, డీఎస్ఐఆర్, సీఆర్ టీడీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో 'విద్యుత్ వాహనాల పురోగతిలో సవాళ్ళు భవిష్యత్' అనే అంశంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సందీప్ మాట్లాడుతూ పెట్రోల్ ధరలు పెరిగిపోవడంతో వాహనదారులు విద్యుత్‌వాహనాల కొనుగోలుపై మక్కువ చూపిస్తున్నారన్నారు. వాహనాల బ్యాటరీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఎటువంటి లోపాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సందీప్‌ను ఆచార్యులు సత్కరించారు. రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ శ్రీఫణికృష్ణ, అడహక్ ఫ్యాకల్టీ డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ మూర్తి, డాక్టర్ మురళి, డాక్టర్ అమృత్‌రాజు, డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డాక్టర్ పవన్ పాల్గొన్నారు.

## 28 నుంచి బాస్కెట్ బాల్ పోటీలు



క్రీడా పోటీల వివరాలు వెల్లడిస్తున్న స్పోర్టింగ్ క్లబ్ సభ్యులు

నూజివీడు టౌన్, మార్చి 22: బొబ్బిలి కొండలరావు మెమోరియల్ క్రీడా పోటీలను ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్నట్టు స్పోర్టింగ్ క్లబ్ సభ్యుడు టీవీ కృష్ణారావు తెలిపారు. స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నూజివీడు డీఏఆర్ కళా శాలలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు బొబ్బిలి కొండలరావు మెమోరియల్ జాతీయ స్థాయి ఆహ్వాన బాస్కెట్ బాల్ పోటీలు లీగ్ అండ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నూజివీడు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు రామిశెట్టి మురళి, పగడాల సత్యనారాయణ, ఇతర సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'పశ్చిమ'లో టెన్త్ పరీక్ష ప్రశాంతం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 22 : పదో తరగతి గణితశాస్త్ర పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 127 పరీక్ష కేంద్రాల్లో 21,527 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 20,734 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 793 మంది గైర్హాజరయ్యారు. ఎస్ఎస్‌సీ (ఏపీఓఎస్ఎస్) పరీక్ష 830 మందికి 729 మంది, ఇంటర్మీడియట్ (ఏపీఓఎస్ఎస్) పరీక్షకు 810 మందికి 738 మంది హాజరయ్యారు. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డీఈవో వెంకటరమణ తెలిపారు.

## 'పది' పరీక్ష కేంద్రంలో నిబంధనలు నిల్ !

పెనుగొండ, మార్చి 22 : పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద అధికారులు నిబంధనలకు నీళ్ల వదిలారు. ఈక్రమంలో మాస్ కాపీయింగ్ అంటూ విస్తృత ప్రచారానికి దారితీసిన ఘటన పెనుగొండలో జరిగింది. వివరాలిలా.. పెనుగొండ చైతన్య స్కూలులో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రంలో శుక్రవారం లెక్కలు పరీక్ష జరిగింది. ఉదయం పదో తరగతి, మధ్యాహ్నం చైతన్య స్కూలు విద్యార్థులకు రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం పరీక్ష పూర్తయితే గాని కేంద్రంలోకి ఇతరులు ఎవరూ ప్రవేశించకూడదు. దీనికి విరుద్ధంగా పాఠశాల సిబ్బంది పరీక్ష జరుగుతుండగానే స్కూలులోకి ప్రవేశించారు. ఈ క్రమంలో మాస్ కాపీయింగ్ జరుగుతుందంటూ ప్రచారం జరిగి మీడియా చేరడంతో అధికారులు హుటాహుటిని సిబ్బందిని బయటకు పంపించారు. చైతన్య పాఠశాలలో నిబంధనలు పాటించకపోవడం వంటి ఆరోపణలపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎంఈవో సుభాకరరరావు తెలిపారు.

## పట్టపగలు చోరీ



కైకలూరు, మార్చి 22: తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీ అయిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు కైకలూరు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామానికి చెందిన దాట్ల ప్రభావతి అదే గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తోంది. గురువారం రోజువారీమాదిరిగా ఇంటికి తాళం వేసి స్కూల్‌కు వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. చోరీ అయినట్టు గుర్తించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వచ్చి పరిశీలించి బీరువాలోని ఏడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ అయినట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## కృష్ణాపురం చెరువులో మట్టి తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ద్వారకాతిరుమల, మార్చి 22 : అడ్డగోలుగా మట్టిని కొల్లగొట్టి జేబులు నింపుకోవడమే పనిగా కొంతమంది వైసీపీ నాయకులు తవ్వకాలు జరుపుతున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఆ వైపు దృష్టి సారించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని పంగిడిగూడెం పంచాయతీ సూర్యచంద్రరావుపేట శివారు కృష్ణాపురం చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గ్రామాల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఈ మట్టిని దూరాన్ని బట్టి రూ.500 నుంచి వెయ్యి రూపాయలకు విక్రయిస్తూ రాత్రి పగలు తేడా లేకుండా సంపాదనే ధ్యేయంగా కార్యక్రమాలు సాగిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.



చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్

| 22-03-2024 పొగాకు ధరలు (రూ.) | పొగాకు కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం | సరాసరి |
|---|---|---|---|---|
|  | దేవరపల్లి | 240 | 238 | 239.91 |
| | జంగారెడ్డిగూడెం-1 | 240 | 235 | 239.50 |
| | జంగారెడ్డిగూడెం-2 | 240 | 235 | 239.46 |
| | కొయ్యలగూడెం | 240 | 236 | 239.95 |
| | గోపాలపురం | 241 | 235 | 239.62 |

# తొలగిన బొమ్మలు, రంగులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చి ఆరు రోజులైంది. కోడ్ అమలు చేయాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కొన్ని చోట్ల అధికారులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ మరికొన్ని చోట్ల నిబంధనలు అమలు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి పూర్తిస్థాయిలో ఎన్నికలు నిబంధనలు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.



టినరసాపురంలో జగన్ స్టిక్కర్‌లపై కాగితాలు అంటించిన దృశ్యం



కైకరం వద్ద హైవేలో చెట్లకు రంగులు మార్చిన అధికారులు

టి.నరసాపురం, మార్చి 22 : 'విద్యుత్ మీటర్‌లపైనా జగన్ బొమ్మ' అనే శీర్షికన ఈనెల 21వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై విద్యుత్ శాఖ స్పందించింది. మండలంలో దాదాపు 4,500 ఉచిత విద్యుత్ మీటర్లపై సీఎం జగన్ ఫొటోతో పాటు నవరత్నాల పథకాలను ప్రదర్శించే స్టిక్కర్‌లను పెట్టడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘిం చినట్టేనని ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించడంతో విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు స్పందించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఆ స్టిక్కర్‌లు కనిపించకుండా పేపర్‌లను అంటించే చర్యలు తీసుకున్నారు.

### కైకరంలో చెట్ల రంగులు మార్చిన అధికారులు

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో ఎన్నికల నిబంధనల అమలులో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'అధికారులకు కనిపించని అధికార పార్టీ బోర్డులు' శీర్షిక పేరుతో ప్రచురితమైన హైవే పక్కన బస్సు యాత్ర సందర్భంగా వేసిన రంగులను శుక్రవా రం ఉదయం ఈవోపీఆర్‌డీ షేక్ షంషుద్దీన్, కార్యదర్శి నాగేంద్ర స్పందించి వైసీపీ రంగులను తొలగించి వాటి స్థానే పింక్ రంగు వేశారు.

### సాగునీరు అందిస్తాం

- స్పందించిన అధికారులు
- రైతుల హర్షం

పాలకోడేరు: పొలాలకు సాగునీరు అందక రైతులకు కంటి మీద కునుకు కరువైంది.. అని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. మోగల్లు గ్రామంలో దక్షిణ కాల్వను ఆనుకుని ఉన్న పంట పొలాలను సాగునీరు అందకపోవడంతో చేలు బీళ్లుగా మారాయని సాగునీరు కోసం రైతులు ఎదురు చూస్తున్నారని ప్రచురితం కావడంతో అధికారులు వెంటనే స్పందించి పొలాలను పరిశీలించారు. తక్షణమే నీరు అందించేలా ఇరిగేషన్ శాఖ అధికారులతో వ్యవసాయశాఖ అధికారులు రైతుల వద్ద నుంచే మాట్లాడారు. దక్షిణ కాల్వకు ఆనుకుని వున్న పంట పొలాలకు సాగునీరు పుష్కలంగా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పొలాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఏవో నారాయణరావు తెలిపారు.



మోగల్లులో పొలాలు పరిశీలిస్తున్న ఏవో నారాయణరావు

### వాటర్ ట్యాంకుల మాటేంటి ?





నారాయణపురం, అక్కుపల్లిగోకవరంలలో వైసీపీ రంగుల్లో మంచినీటి పథకాలు

ఉంగుటూరు, మార్చి 22 : మండలంలోని నారాయణపురం, అక్కుపల్లిగోకవరంలోని రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు వైసీపీ రంగులు వేయడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఆర్అండ్‌బీ నిబంధనల మేరకు రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు రంగులు నిర్ణయించి వేసేవారు. ప్రస్తుతం రాజకీయ రంగులుగా అధికార పార్టీ వారి కోరిక ప్రకారం రక్షిత మంచినీటి పథకాలకు రంగులు వేయడంతో పలువురు ఆవేదన చెందుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏవిధంగా స్పందిస్తారోనని వేచి చూస్తున్నారు.

### వీటికి కోడ్ వర్తించదా ?

ఇరగవరం, మార్చి 22 : ఎన్నికల కోడ్ ఇంకా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ ప్రచార యావతో దొరికిన చోటల్లా వైసీపీ రంగులు వేసి వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. కరెంటు స్తంభాల నుంచి విద్యార్థులకు అందించే చిక్కీల కవర్ల దాకా దేనినీ వదలకుండా జగన్ ఫొటోలు, ఆ పార్టీ రంగులతో నింపేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా కొన్ని చోట్ల సిబ్బంది, అధికారుల అలసత్వంతో శిలాఫలకాలు, సంపద తయారీ కేంద్రాలు, వాటర్ ట్యాంకులు, చెత్తను సేకరణ వాహనాలపై పార్టీ రంగులు తొలగించకపోవడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



చెత్తను తరలించే ప్రభుత్వ వాహనం



రాపాకలో సంపద తయారీ కేంద్రం

## ఆశ్రమ విద్యార్థినికి అనారోగ్యం

- సిబ్బంది చర్యలపై తల్లిదండ్రుల అసంతృప్తి
- వైద్య పరీక్షలు జరిపి మందులు ఇస్తున్నామంటున్న ఏటీడబ్ల్యూవో శ్రీవిద్య



బుట్టాయగూడెం సీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న విద్యార్థిని వైశాలి

బుట్టాయగూడెం, మార్చి 22 : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న గోరం డమరిక వైశాలి అనే విద్యార్థిని అనారోగ్యం బారినపడింది. శుక్రవారం విద్యార్థిని తల్లిదండ్రులు బుట్టాయగూడెం సీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించారు. బాలికను పరీక్షించిన వైద్యులు శనివారం మళ్లీ ఆసుపత్రికి తీసుకువస్తే రక్తపరీక్షలు చేసి మందులు ఇస్తామని తెలపడంతో తల్లిదండ్రులు లక్ష్మణ్, శాంతి బైక్‌పై స్వగ్రామం మర్రిగూడెం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతిగృహంలో ఉంటున్న పిల్లల ఆరోగ్యాల పట్ల సిబ్బంది తీసుకుంటున్న చర్యలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పాపకు నెలలో మూడు పర్యాయాలు జ్వరం వచ్చినట్టు ఫోన్ చేసిందని గురువారం మళ్లీ ఫోన్ చేయడంతో వసతిగృహానికి వచ్చి ఇంటికి పంపించాలని అడిగామని, రాత్రిపూట పంపేది లేదని శుక్రవారం పంపుతా మని చెప్పడంతో.. జ్వరంతో బాధపడుతున్న పాపను ఆసుపత్రికి తీసుకెళ్లామన్నారు. మా పాపతోపాటు మరికొంతమంది పిల్లలు అనారోగ్యంతో బాధపడు తున్నారని సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై ఏటీడబ్ల్యూవో శ్రీవిద్యను వివరణ కోరగా అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లల కు వెంటనే వైద్యపరీక్షలు జరిపి వైద్యుల సూచనల మేరకు మందులు ఇస్తున్న ట్టు తెలిపారు. వైశాలికి నర్సులు రక్తపరీక్షలు చేశారని ఇబ్బంది ఏమిలేదన్నా రన్నారు. వైశాలిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకువెళ్లారని అనారోగ్యంగా ఉంటే తల్లిదండ్రులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.

## బెంగళూరు ఎక్స్‌ప్రెస్ పొడిగింపుపై సస్పెన్స్

- ఈనెల 29తో ముగుస్తున్న గడువు



నరసాపురం, మార్చి 22: నరసాపురం-బెంగళూరు మధ్య నడుస్తున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్‌పై సస్పెన్స్ నెలకొంది. ఈనెల 29తో పొడిగింపు గడువు ముగుస్తుంది. ఈ క్రమంలో వచ్చే నెల నుంచి ఈ రైలు కొనసాగుతుందా ? లేదా అనే సస్పెన్స్ ప్రయాణికుల్లో నెలకొంది. వచ్చే నెలలో అడ్వాన్స్ రిజర్వేషన్ టిక్కెట్లు ఇవ్వడం లేదు. డబ్లింగ్ లైన్ పూర్తయిన తరువాత దక్షిణమధ్య రైల్వే నరసాపురం నుంచి బెంగళూరుకు రెండు ప్రత్యేక రైళ్ల ప్రవేశపెట్టింది. వాటిలో ఒకటి గుంటూరు-మార్కాపురం మీదుగా, మరొకటి విజయవాడ-ఒంగోలు మీదుగా నడుపుతున్నారు. వారంలో రెండుసార్లు ఈ రైళ్ల నడుస్తూ వచ్చాయి. మూడు నెలల క్రితం గుంటూరు మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసింది. అప్పటి నుంచి 07153 నంబర్‌తో ఒంగోలు మీదుగా వెళ్లే రైలు మాత్రం కొనసాగుతుంది ఈ రైలు ప్రతి శుక్రవారం నరసాపురంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం బెంగళూరు చేరుతుంది. తిరిగి ఆదే రోజు అక్కడ బయలుదేరి ఆదివారం నరసాపురం వస్తుంది. వారానికి ఒక్కసారి నడుపుతున్నప్పటికీ డిమాండ్ ఫుల్‌గా ఉండడంతో వారంలో మరోరోజు పొడిగించి ఏప్రిల్ నుంచి వారంలో రెండు రోజులు నడుపుతారని ప్రయాణికులు ఎదురుచూశారు. దీనికి భిన్నంగా రైల్వే వ్యవహారం కనిపిస్తోంది. ఈనెల 29తో గడువు ముగుస్తోంది. పొడిగింపుపై ఎటువంటి ప్రకటన చేయలేదు. వచ్చేనెల నుంచి ఈ ఎక్స్‌ప్రెస్ నడుస్తోందా? లేదా అనే సస్పెన్స్ నెలకొంది.

## కోడ్ అతిక్రమించిన జనసేన నాయకులపై కేసు

ఏలూరు క్రైం, మార్చి 22 :ఎన్నికల నిబంధనలు అతిక్రమించారని దెందులూరు నియోజకవర్గ జనసేన నాయకులపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గురువారం రాత్రి ఏలూరు అశోక్‌నగర్‌లోని నియోజకవర్గ జనసేన నాయకుడు కొఠారు ఆదిశేషు క్యాంపు కార్యాలయం వద్ద దెందులూరు జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు ఎక్కువమంది రావడంతో కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపైనే వీరి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరులోని ఫ్లయింగ్ స్క్వాడ్ నంబరు-4 ఇన్‌ఛార్జి అయిన పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ శనగన బాలాజీబోసుబాబు తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనుమతులు లేకుండా సమావేశం ఎందుకు పెట్టారంటూ ప్రశ్నించారు. మరోవైపు ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ వారి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. బోసుబాబు ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు దెందులూరు జనసేన నాయకులైన కొఠారు ఆదిశేషు, మట్టా సాయిసుధాకర్, కోటగిరి వెంకటసుధాకర్, మట్టా రంగబాబులపై ఎన్నికల నిబంధనలు అతిక్రమించారంటూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన డీఎస్పీ, సీఐ



పోలవరం, మార్చి 22 : ఆటో బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాల పాలైన ఘటన పోలవరం మండలం పట్టిసీమ పంచాయతీ వెంకటాపురం చెరుకు ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం జరిగింది. సీఐ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం దొండపూడి నుంచి వస్తున్న సర్వీసు ఆటోని పోలవరం నుంచి వేగంగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఆటోలో పోలవరం ఆసుపత్రికి వెళుతున్న రోగి, బైక్ నడుపుతున్న వ్యక్తి గాయాలపాలయ్యారు. అదే సమయంలో ఆ మార్గాన వెళుతున్న డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ మధుబాబు తమ వాహనాన్ని ఆపి గాయలపాలైన వారిని మరో వాహనంలో పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

ఏలూరు క్రైం, మార్చి 22 : మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురు వ్యక్తులకు కోర్టు జరిమానా విధించింది. ఏలూరు ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వారిని శుక్రవారం కోర్టుకు హాజరుపర్చగా ఒకొక్కరికి రూ.మూడు వేల చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.

## పోలీసు స్టేషన్ ఎదుట దళితుల ధర్నా



పోలీసు స్టేషన్‌వద్ద ఆందోళన చేస్తున్న దళిత యువకులు

పెనుగొండ/ఆచంట, మార్చి 22: ఆచంటకు చెందిన ఓ బాలుడు డాక్టర్ అంబేడ్కర్‌పై సోషల్ మీడియాలో కించపరిచే పోస్టింగ్ పెట్టిన నేపథ్యంలో కొందరు దళితులు గురువారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పెనుగొండ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆ బాలుడిని తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆందోళనకు ఎక్కువ సంఖ్యలో యువకులు రావడంతో సమీపంలో ఉన్న సీసీ కెమేరాలను, పోలీసు స్టేషన్ అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసు స్టేషన్ వద్ద 144 సెక్షన్ విధించారు. ఈ ఘటనపై ఇప్పటివరకు 23 మంది యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ సుభాని తెలిపారు.

### అనుచిత పోస్టులు చేసిన బాలుడిపై కేసు

సోషల్ మీడియాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత పోస్టులు చేసిన ఆచంటకు చెందిన ఓ బాలుడిపై ఆచంట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం ఆచంట ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆచంటకు చెందిన ఓ బాలుడు ఇన్‌స్టాగ్రామ్‌లో అంబేడ్కర్‌పై అనుచిత పోస్టులు చేసినట్టు ఫిర్యాదులు రావడంతో ఐటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, బాలుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

## మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడి గృహనిర్బంధం



గృహనిర్బంధంలో నల్లి రాజేష్

పాలకొల్లు అర్బన్, మార్చి 22 : మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్‌ను శుక్రవారం పట్టణ పోలీసులు గృహనిర్బంధం చేశారు. పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేసిన నేపథ్యంలో కొంతమంది దళిత యువ కులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈవిషయం తెలుసుకున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ పెనుగొండ పోలీస్ స్టేషన్‌కువెళ్ళి ఆందోళన చేయాలని శుక్రవారం సిద్ధం కావడంతో పట్టణ పోలీసులు గృహ నిర్బంధం చేశారు.



కలుషితంగా మారిన మొగలూరు ప్రధాన కాల్వ

## మొగల్తూరు కాల్వ నీరు కలుషితం

- పేరుకుపోయిన గుర్రపుడెక్క తూడు
- వ్యాధులు సోకుతాయని గ్రామస్థులు భయాందోళన

మొగల్తూరు, మార్చి 22 : మొగల్తూరు ప్రధాన కాల్వలో అపారిశుద్ధ్యం పేరుకుపోవడంతో నీరు కలుషితంగా మారింది. ఈ నీరు మంచినీటి ప్రాజెక్టుల ద్వారా శుద్ధిచేసి వచ్చినా.. వ్యాధులు సోకుతాయేమోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. మొగల్తూరు, రామన్నపాలెం, పేరుపాలెం, కేపీపాలెం గ్రామాల ఆయకట్టుకు, మొగల్తూరు, కేపీపాలెం బృహత్తర మంచినీటి ప్రాజెక్టులకు ఈ కాల్వ నీరే వినియోగిస్తున్నారు. కాల్వలో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడం, ఎగువ ప్రాంతాల నుంచి కళేబరాలు కొట్టుకు రావడంతో శివారున ఉన్న మొగల్తూరులోని కాల్వ నీరు కలుషితంగా మారుతోంది. రైతులకు గుర్రపుడెక్క, తూడు ప్రభావంతో సాగునీటి ప్రవాహం లేక నీరందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదే నీటిని ఇంజన్ల సాయంతో మంచినీటి ప్రాజెక్టులకు తోడుతున్నారని ప్రాజెక్టు చెరువుల నుంచి కుళాయిల ద్వారా వచ్చేనీటిని తాగితే ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని తీర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మొగల్తూరు ప్రధాన కాల్వలో తూడు, గుర్రపుడెక్క తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## వైభవంగా మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు

కలిదిండి, మార్చి 22 : మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ చైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బండి తులసీరావు, బోళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### పరిచయస్తుడే బ్యాంకు రుణం కాజేశాడు..

- ఆకివీడు పోలీస్‌స్టేషన్‌లో బాధిత వ్యాపారి ఫిర్యాదు

ఆకివీడు, మార్చి 22: ఓ పరిచయస్తుడి ద్వారా తనకు వచ్చిన బ్యాంకు రుణం మొత్తాన్ని రూ.15,00,960 అతడే కాజేశాడంటూ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు శుక్రవారం తెలిపా రు. స్థానిక రెడ్డివీధిలో జోగి కిరణకుమార్ అద్దెకు నివాసం ఉంటున్నాడు. పట్టణ పరిధిలో సాయి ఐరన్ కబోర్డ్స్ అండ్ సేఫ్ వర్క్స్ పేరుతో షాపు నిర్వహిస్తున్నాడు. సంతమార్కెట్‌కు చెందిన పడాల బాలసుబ్రహ్మణ్యం వ్యాపారం నిమిత్తం కిరణ్‌కుమార్‌కు స్థానిక బ్యాంకులో రుణం ఇప్పించాడు. అనంతరం ఇద్దరూ విశాఖపట్నంలోని కంచరపాలెంకు వెళ్లి అక్కడ లోటస్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీలోని సరుకుకు సంబంధించి ఓ వ్యక్తికి కొటేషన్‌తో పాటు నగదు బదిలీ చేశారు. త్వరలో సరుకు వస్తుందని చెప్పడంతో తిరిగి ఆకివీడు వచ్చేశారు. సరుకు రాకపోవడంతో ఆరా తీయగా వాస్తవానికి అక్కడ లోటస్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ లేదని.. అక్కడ వున్న వ్యక్తి, బాలసుబ్రహ్మణం తన బ్యాంకు రుణాన్ని కాజేశారని గుర్తించి మోసం పోయానన్నాడు. ఈ విషయంపై గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

టి.నరసాపురం, మార్చి 22 : అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. మండలంలోని బండివారిగూడెం గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

### కొండపల్లిలో మళ్లీ సైబర్ క్రైం

- ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.40 వేలు మాయం

కుక్కునూరు, మార్చి 22 : కుక్కునూరు మండలంలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వరుసగా రెండో రోజు శుక్రవారం వైఎస్సార్ చేయూత పథకం కింద డబ్బులు ఖాతాలో జమ చేస్తామని చెప్పి ఓవ్యక్తి ఖాతాలో నుంచి రూ.40వేలు మాయం చేశారు. ముందుగా సైబర్ నేరగాళ్లు సచివాలయ సిబ్బంది అంటూ వలంటీర్లకు ఫోన్ చేస్తున్నారు. మీకు తెలిసిన వారికి ఎవరికైనా ప్రభుత్వ పథకాలకు సంబంధించి డబ్బులు జమ కాకపోతే వారి వివరాలు ఇవ్వాలంటూ కోరుతున్నారు. ఈమేరకు వలంటీర్లు ఎవరికైతే ప్రభుత్వ పథకాలు అందలేదో వారి ఫోన్ నంబరు, అడ్రస్సు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు ఎవరికైతే ప్రభుత్వ పథకాలు అందలేదో వారికి ఫోన్‌లు చేస్తున్నారు. గూగుల్ పే, లేదా ఫోన్‌పే నంబరు ఇవ్వాలని చెబుతున్నారు. అనంతరం వారిని నమ్మించి ఖాతాలో నుంచి సొమ్ము మాయం చేస్తున్నారు. బాధితులు లబోదిబోమంటూ సైబర్ సెల్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. వరుసగా రెండో రోజు కూడా కుక్కునూరు మండలం కొండపల్లిలో సైబర్ క్రైం నేరాలు జరిగాయి.

### వృద్ధురాలి మెడలో ఐదు కాసుల గొలుసు చోరీ

ఏలూరు క్రైం, మార్చి 22 : పాలప్యాకెట్ కోసం వెళ్లి వస్తున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు తెంపుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ తెలిపారు. ఏలూరు శంకర్‌మఠం వీధికి చెందిన గంధం లక్ష్మీత్రివేణి(70) అనే వృద్ధురాలు గురువారం రాత్రి ఆ సెంటర్ సమీపంలో పాల ప్యాకెట్‌కు వెళ్లి ఇంటికి వెళ్తుండగా ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని ఐదు కాసుల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యారు. కిందపడిన ఆమె కొద్దిసేపటి తరువాత కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



### కమ్మేసిన పొగమంచు

ఒకవైపు ఎండలు మండుతున్నాయి. ఉక్కబోత తోడు కావడంతో ప్రజలు తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. మరోవైపు శుక్రవారం ఉదయం గంట సేపు ఆచంట మండలంలో పలు చోట్ల పొగమంచు కమ్మేసింది. ఉదయం తొమ్మిది గంటలైనా మంచు వీడకపోవడంతో పలు వాహనదారులు రోడ్లు కానరాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- ఆచంట

## పోషకాహారం తీసుకోవాలి..



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు అధికారి సుజాతా రాణి

భీమవరం రూరల్, మార్చి 22 : బాలికలు నిత్యం పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని జిల్లా ప్రాజెక్టు అధికారి బి.సుజాత రాణి సూచించారు. దిరుసుమర్రు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన పోషకాహార పక్షోత్సవాలు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో పి.లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ డి.అనిల్ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు దయామణి, కల్వరి, జ్యోతిలక్ష్మి, బేబిరాణి, మీనాక్షి, కేసవ లక్ష్మి, రమాదేవి, విజయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

## తండ్రితో కలిసి తనయుడి ప్రచారం

నరసాపురం రూరల్,మార్చి 22:ఈ ఐదేళ్ళల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మా నాన్నకు ఓట్లు వేసి గెలిపించాలంటూ శుక్రవారం తండ్రి ముదునూరి ప్రసాదరాజుతో కలిసి తనయుడు వంశీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని మల్లవరం గ్రామంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో ప్రసాదరాజుతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలందిస్తూ ఓట్లను అభ్యర్థించారు. మీకు మంచి జరిగితే ఓటు వేసి గెలిపించాలని ముదునూరి విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోని, చైర్‌పర్సన్ వెంకటరమణ, జెవీఆర్, మధు, కృష్ణాజీ, సఖినేటిపల్లి సురేష్ పాల్గొన్నారు.

## ఆలయాల్లో ఎమ్మెల్యే గ్రంధి పూజలు

భీమవరం రూరల్, మార్చి 22 : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను దాదాపుగా అమలు చేశారన్నారని వైసీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆయన శుక్రవారం ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుట్టారు. ముందుగా వినాయకుడిని, మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, డా.వేగిరాజు రామకృష్ణం రాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

భీమవరం టౌన్, మార్చి 22 : భీమవరం డిపో పరిధిలో ఉన్న ఐదు మండలాల్లో ఉన్న ప్రయాణికులకు సంబంధించి ఫిర్యాదులు, సూచనలు స్వీకరించేందుకు శనివారంనాడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిపో అసిస్టెంట్ మేనేజర్ సురేష్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సెల్ నెంబర్ 99592 25485కుఫోన్ చెయ్యాలని కోరారు.

## నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

భీమవరం టౌన్, మార్చి 22 : పురపాలక సంఘానికి చెల్లించవలసిన ఆస్తిపన్ను, ఖాళీస్థలం పన్నులు ఈ నెలాఖరు లోపు చెల్లిస్తే వడ్డీ మాఫీ సదుపాయాన్ని కల్పించారని మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు. . యజమానులు చెల్లించాల్సిన పన్నులతో పాటు పాత బకాయిలు కూడా ఉన్నట్లయితే ఒకే మొత్తంగా చెల్లిస్తేనే వడ్డీ మాఫీ జరుగుతుందని విడి మొత్తాల్లో చెల్లించినట్లయితే వడ్డీ మాఫీ సదుపాయంకోల్పోవలసి వస్తుందని ఆమె చెప్పారు. పన్ను చెల్లింపులకు వార్డు సచివాలయాలలోను, పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు



పెనుమంత్ర, మార్చి 22: పెనుమంత్ర పోలీస్ స్టేషన్ పరిధిలోని కేంద్ర బలగాలు సీఐఎస్ఎఫ్ బలగాలతో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మాముడురు, పోలమూరు, ఆలమూరు, మార్టేరు గ్రామాలలో కవాతు నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని నెలకొల్పేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రజలు స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్య పరచాలని కోరారు. కేంద్ర బలగాల కవాతులో పెనుమంత్ర ఎస్సై వేంద్ర వెంకటేశ్వరరావు సెక్టార్ అధికారులు సిబ్బంది పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

**మొగల్తూరు:** ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు, భయాందోళనకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలని మొగల్తూరు ఎస్ఐ కె. వెంకట రమణ సూచించారు. శుక్రవారం సాయంత్రం కొత్తోట, కాళీపట్నం తూర్పు, పడమర ప్రధాన వీధుల్లో సిఐఎస్ఎఫ్ పోలీసులు, సివిల్ పోలీసులు మార్చిఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఓటర్లుకు మనోస్థైర్యం కల్పించేందుకే మార్చిఫాస్ట్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యనారాయణ, రాజేంద్ర, పాండు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒత్తిడిని జయిస్తే ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 22: మారుతున్న జీవన శైలిలో విద్యార్థులు, అధ్యాపకులు ఒత్తిడిని జయిస్తే ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని సైకాలజిస్ట్ ఝాన్సీరాణి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో సైకలాజికల్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం సైకాలజీపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్ సైకాలజిస్ట్ ఝాన్సీరాణిని సత్కరించారు.

## మతం పేరుతో మోదీ రాజకీయాలు

తణుకు, మార్చి 22: మతం పేరుతో మోదీ రాజకీయాలు చేయడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్ రాయ్ ఆరోపించారు. శుక్రవారం సీఐటీయూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లగా మోదీ ప్రభుత్వం హామీలు అమలు చేయలేదని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. కార్మిక హక్కుల కోసం యూనియన్ మరింత పోరాటం సాగిస్తుందన్నారు. మతం-మతోన్మాదం అనే అంశంపై జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడారు.





ఆకివీడులో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు..
వీరవాసరంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

## మ్యాథమెటిక్స్ పరీక్ష ప్రశాంతం

**ఆకివీడు..33 మంది గైర్హాజరు**

ఆకివీడు, మార్చి 22: టెన్త్ మ్యాథమెటిక్స్ (లెక్కలు) పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని నాలుగు సెంటర్లలో 798 మందికి 33 మంది గైర్హాజరయ్యారు. సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు పరిశీలించారు.

**ఉండి.. 23 మంది గైర్హాజరు**

**ఉండి:** మండలంలో లెక్కలు పరీక్షకు 23మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు మండల విద్యాఖాధికారి జ్యోతి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఐదు ప్రధాన సెంటర్లలో పరీక్షలను విద్యార్థులు రాశారు.

**కాళ్ళ.. 78 మంది గైర్హాజరు**

**కాళ్ళ:** కాళ్ళ, కోపల్లె, కలవపూడి, ఏలూరుపాడు జడ్పీ హైస్కూల్‌లో 892 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 814 మంది రాశారని, 78 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర తెలిపారు.

**పాలకోడేరు..61 మంది గైర్హాజరు**

**పాలకోడేరు:** పాలకోడేరు మండలంలో శుక్రవారం పదవ తరగతి మ్యాథ్స్ పరీక్ష ప్రశాంతంగా సాగాయి. మండలంలో 788 మంది విద్యార్థులకు గాను 627 మంది పరీక్షకు హాజరయ్యారని, 61 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో పీఎస్ నాగరాజు తెలిపారు.

**ఆచంట..67 మంది గైర్హాజరు**

**ఆచంట:** మండలంలో 542 మంది విద్యార్థులకు గాను 12 మంది గైర్హాజరు కాగా 166 మంది ప్రైవేటు విద్యార్థులకు గాను 55 మంది గైర్హాజరు అయినట్లు ఎంఈవోలు ఎ. ఉషారాణి , రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

**మొగల్తూరు.. 53 మంది గైర్హాజరు**

**మొగల్తూరు:** మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల ద్వారా 888 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 835 మంది హాజరయ్యారని 53 మంది గైర్హాజరు అయినట్టు ఎంఈవో శ్యామ్యూల్ జాన్ తెలిపారు.

**వీరవాసరం..70 మంది గైర్హాజరు**

**వీరవాసరం:** వీరవాసరం మండలంలో మొత్తం 70 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. వీరవాసరం డిప్యూటీ ఎంఈవో/ఎంఆర్ కె జడ్పీహైస్కూల్ కేంద్రాలను స్పెషల్ స్క్వాడ్ తనిఖీ చేసింది.









వాలమర్రులో ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర ప్రచారం.. భీమవరంలో అంజిబాబును కలసిన టీడీపీ నాయకులు.. పిప్పరలో ప్రసంగిస్తున్న ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని.. పెదతాడేపల్లిలో పర్యటిస్తున్న బొలిశెట్టి

# కక్షల ప్రభుత్వాన్ని సాగనంపుదాం: అంజిబాబు

భీమవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కక్ష పూరిత ప్రభుత్వాన్ని సాగనంపుదామంటూ తెలుగుదేశం-జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అంజిబాబు పేర్కొన్నారు. భీమవరంలో శుక్రవారం వీరవాసరం, నౌడూరు నాయకులు కలిశారు. భీమవరం నియోజకవర్గంలో అరాచక పాలన. కక్ష పూరిత రాజకీయాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అంజిబాబు అన్నారు. జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మైనారిటీలకు అండగా ఉంటానని తనను కలిసిన టీడీపీ మైనారిటీ సెల్ నాయకులకు భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజలంతా భయభ్రాంతులకు గురయ్యారని, న్యాయం కోసం మాట్లాడితే కేసుల్లో ఇరికించారని అంజిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మైనారిటీ సెల్ నాయకులు ఖలీల్, రబ్బాని, ఫిరోజ్, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు పాల్గొన్నారు.

### చేనేత వర్గాలకు అండ: ఎమ్మెల్యే నిమ్మల

**పాలకొల్లు రూరల్:** చేనేత వర్గాలకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని, రాబోయేది జనసేన, బీజేపీ బలపరిచిన తెలుగుదేశం పార్టీనే అధికారం చేజిక్కించుకుంటుందని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అన్నారు. మండలంలోని వాలమర్రు గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్సీ అంగరతో కలిసి ఎమ్మెల్యే రామానాయుడు ఇంటింటా ప్రచారం గావించారు. ఈసందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ గతంలో మగ్గం చేసే చేనేత వర్గాల వారికి విద్యుత్ 200 యూనిట్ల వరకూ ఉచితంగా అందించడం జరిగిందన్నారు. అంతే కాకుండా నూలు సబ్సిడీ ధరలకు ఇచ్చేవారని, తుఫాన్ల సమయంలో 10రోజులు పాటు 10కిలోల బియ్యం ఉచితంగా అందించావారమని, నేడు జగన్ హయాంలో ఏ ఒక్కటి అమలు కావడం లేదన్నారు.

### విశాఖను మాదక ద్రవ్యాల కేంద్రంగా మార్చారు: తోట

**భీమవరం అర్బన్:** రాష్ట్ర రాజధానిగా విశాఖను అభివృద్ధి చేస్తానన్న ముఖ్యమంత్రి జగన్ మాదక ద్రవ్యాలకు కేంద్రంగా చేశారని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి శుక్రవారం ప్రకటనలో విమర్శించారు. రానున్న ఎన్నికలలో జగన్ గెలవాలని ఓటర్లకు డబ్బు చీరలు మద్యం బహుమతులతో పాటు గంజాయి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారనేందుకు డ్రగ్స్ పట్టివేత సాక్ష్యం అన్నారు. ఎన్నికలలో జగన్ గెలుపు కోసం బ్రెజిల్‌కి చెందిన డ్రగ్స్ మాఫియాతో వైసీపీ చేతులు కలిపిందని ఆరోపించారు.

### ఎన్నికలయ్యే వరకు వలంటీర్లను అడ్డుకోవాలి: బొల్లా

**ఆకివీడు:** ఎన్నికలు పూర్తయ్యే వరకు వలంటీర్లను అడ్డుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లబ్ధిదారుల పించన్ల పుస్తకాలపై జగన్ ఫొటో ఉందని దానిని ఎలా తొలగిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు పలు సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తే ఆర్వోను అడిగి చెబుతామంటున్నారు, సమావేశాల్లో కూడా అదే మాట చెబుతున్నారన్నారు. టోల్ ఫ్రీ నెంబర్లు పెట్టాలని సమావేశంలో తెలిపినా నేటికి ఏర్పాటు చేయలేదన్నారు. పట్టణంలో అధికార పార్టీ నేతలు వలంటీర్లతో కొన్నిచోట్ల అక్కడక్కడ రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలుస్తోందని, దానిని కూడా లేకుండా చేయాలన్నారు.

### వైసీపీ నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిద్దాం : గన్ని

**గణపవరం:** వైసీపీ ప్రజావ్యతిరేక పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిద్దామని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు శుక్రవారం పిప్పర టీడీపీ కార్యాలయంలో గణపవరం మండల కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశానికి టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన ఉంగుటూరు నియోజకవర్గ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజును గెలిపించాలని కార్యకర్తలను కోరారు. టీడీపీ నాయకులు ఐటీ సుబ్బరాజు, అద్దేపల్లి వాసురాజు, యాళ్ళ సుబ్బారావు, దండు బాబ్జీరాజు, కూసంపూడి సురేంద్రకుమార్, కూనసాని నాగేశ్వరరావు, జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే నిమ్మల సతీమణి ప్రచారం

**పాలకొల్లు టౌన్:** అభివృద్ధిలో పాలకొల్లుకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే రామానాయుడును గెలిపించాలని ఎమ్మెల్యే నిమ్మల సతీమణి సూర్యకుమారి కోరారు. పాలకొల్లు పట్టణంలోని 13, 14వ వార్డుల్లో శుక్రవారం ఆమె ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉండి ప్రజాసమస్యల పరిష్కారం కోసం పరితపించే ఎమ్మెల్యే నిమ్మలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### వైసీపీ పాలనలో గ్రామాలు నిర్వీర్యం: బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం రూరల్:** గ్రామాలను జగన్ సర్కార్ నిర్వీర్యం చేసిందని తాడేపల్లిగూడెం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెదతాడేపల్లిలో జనసేన, బీజేపీ, టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం పల్లెపోరు నిర్వహించి గ్రామస్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పల్లెలను సుందరంగా తీర్చిదిద్దితే వాటిని వైసీపీ నిర్వీర్యం చేసిందన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి ఇంటింటికి ప్రచారం చేసి ఉమ్మడిగా ప్రజలకు ఏం చేస్తారో వివరించారు. సర్పంచ్ పోతుల అన్నవరం, ఎంపీటీసీలు గోవిందరాజు, సత్యనారాయణ, టీడీపీ నాయకులు గొర్రెల శ్రీధర్, పరిమి రవికుమార్, పసుమర్తి చందు, జనసేన నాయకులు అడపా ప్రసాద్, దాగారపు నాగు, పుల్లా బాబి, బీజేపీ నాయకులు రామగాని సత్యనారాయణ, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీలో చేరిన వారిని స్వాగతిసున్న నాయకర్

## జనసేనలో చేరిక

**నరసాపురం టౌన్/మొగల్తూరు:** జనసేన సిద్ధాంతాలు నచ్చి పేరుపాలెం సౌత్ గ్రామంలోని అంబేడ్కర్ కాలనీ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పి. వెంకటేశ్వరావు, కె.నాగేశ్వరరావు, రాజు, వెంకటరావు, చిన్న, శ్రీను, కాశీరావు, రవి, పాల్, రాజేష్‌లతో పాటు సుమారు 250 మంది పార్టీలో చేరారు. వీరికి కన్వీనర్ బొమ్మిడి నాయకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

## పోలింగ్ బూత్‌ల పరిశీలన



ఆకివీడు, మార్చి 22:రానున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరీ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించి మాట్లాడారు. 118, 119, 120 పోలింగ్ బూత్‌లలో మరుగుదొడ్లు నిర్మాణంలో ఉన్నాయని, మిగిలినచోట్ల మరుగుదొడ్లుతో పాటు తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలున్నాయన్నారు. చినకాపవరం గ్రామంలో పది సమస్యాత్మక పోలింగ్ బూత్‌లున్నట్లు గుర్తించామని తెలిపారు.

## ప్రయాణికులకు వసతులు కల్పిస్తాం



ఆర్టీసీ కొత్త బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం సూర్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్

ఆకివీడు, మార్చి 22: బస్టాండ్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం మౌళిక వసతులు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని భీమవరం డిపో మేనేజర్ వీఎస్వీఎన్ సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కొత్త బస్టాండ్ ప్రాంతాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. మరుగుదొడ్లకు తలుపులు, తాగునీరుతో పాటు కంట్రోలర్ తదితర సమస్యలు ఉన్నాయని వాటిపై తమ ఇంజనీర్‌తో మాట్లాడి ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. బస్సులు పాయింట్‌లోకి రావడంలేదని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు.

## శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలు

తణుకు, మార్చి 22: పట్టణంలోని కుమ్మర శాలివాహనుల సంఘం ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతి నిర్వహించారు. శుక్రవారం వైఎస్ఆర్ పార్కు వద్ద గల శాలివాహన చక్రవర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా వెల్ఫేర్ కమిటీ సభ్యులు బిరుదుకోట చింతన్న, వి. వెంకటేశ్వరావు, చుంచుల వెంకటేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

## బీజేపీవి ప్రజావ్యతిరేక విధానాలు

తణుకు, మార్చి 22: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ళలో ఒక్క భారీ పరిశ్రమను కూడా తేలకపోయిన కేంద్రం విశాఖ స్టీల్‌ను విదేశీ కంపెనీకి కట్టబెట్టాలని యత్నిస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, నాయకులు నీలపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి: ఆర్డీవో



పెంటపాడు, మార్చి 22: పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో చెన్నయ్య అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పెంటపాడు, దర్శిపర్రు, రాచర్ల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. గ్రామస్థాయి అధికారులంతా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. పెంటపాడు, తాడేపల్లిగూడెం తహసీల్దార్లు ఎన్.సురేష్‌బాబు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా.. శివ



కలవపూడిలో స్వతంత్ర అభ్యర్థిగా ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరామరాజు

కాళ్ళ, మార్చి 22 : స్వతంత్ర అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని, తనని మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఉండి నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామ రాజు (కలవపూడి శివ) అన్నారు. కలవపూడి గ్రామం లో రెండవ రోజు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని వావిలాలపాడు, మామిడిపూడి, మోడీ తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివరామరాజు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా పనిచేసిన పదేళ్ళ కాలంలో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానన్నారు. తాను ఎమ్మెల్యేగా లేని సమయంలో నియోజకవర్గ ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. ప్రజలు మనసు ఎరిగిన నాయకుడిగా నన్ను ఆశీర్వదించి రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

## ఎన్నికల అధికారులు అందుబాటులో ఉండాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో స్వామి నాయుడు

ఆచంట, మార్చి 22: సి విజిల్ యాప్ నిర్వహణకు కేటాయించిన అధికారులు 24 గంటలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్వో మాట్లాడుతూ గూగుల్‌మీట్‌ద్వారా సీ విజిల్ మోడల్ కోడ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆచంట వేమవరం, పెనుమంచిలిలోని పోలింగ్ స్టేషన్‌లను తహసీల్దార్‌లతో కలిసి మౌళిక సదుపాయాలను పరిశీలించారు.

## కేంద్ర పథకాల కరపత్రాలు పంపిణీ



పోడూరు, మార్చి 22: వేడంగి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలను చేపట్టి పేదలను ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజు బదరీనారాయణరాజు, నాయకులు శిరిగిడి కొండలరావు, చిరుకూరి దాసు, చల్లారావు, నెక్కంటి పోలయ్య పాల్గొన్నారు.

## ఓటుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

భీమవరం టౌన్, మార్చి 22: ఓటు వేటువేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని మ్యాజిక్ స్టార్ బోస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అడ్డ వంతెన దగ్గర కాటన్ పార్కులో ఓటు హక్కు వినియోగం ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ వేగేశ్న వెంకట కృష్ణంరాజు (మహాదేవపట్నం), మంతెన సత్యనారాయణ రాజు (కలవపూడి), ముదుండి వెంకట రాజు, రంగసాయి మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు.

## వైభవంగా శ్రీవారి కల్యాణం



ఆచంట, మార్చి 22: కొడమంచిలి వేంకటేశ్వర స్వామి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. కల్యాణాన్ని కనుమూరి సత్యనారాయణరాజు, వెంకట సుభద్రా దేవి దంపతులచే నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు మానేపల్లి ఉమా రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## కనక దుర్గమ్మ ఆలయంలో లక్ష దీపోత్సవం



పాలకొల్లుఅర్బన్, మార్చి 22 : యడ్ల బజారులో కనక దుర్గ మ్మ కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. అనతరం అమ్మవారికి ఊంజల సేవ నిర్వహించారు.

## గరుడ వాహనంపై గ్రామోత్సవం



వీరవాసరం, మార్చి 22: వీరవాసరంలోని వేణుగోపాలస్వామి కల్యాణ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామికి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం దేవస్థానం ప్రాంగణంలో ప్రత్యేక పూజలు అనంతరం సదస్యము నిర్వహించారు. దేవస్థానం ఈవో కొండవీటి రామచంద్రరావు, అర్చకులు శ్రీనివాసుల రాంబాబు, సిబ్బంది గ్రామోత్సవం లో పాల్గొన్నారు.

## డ్రై ఫ్రూట్స్‌తో శారదా దేవికి అలంకారం

భీమవరం టౌన్, మార్చి 23 : రెస్ట్‌హౌస్ రోడ్డులో ఉన్న శంకరమఠంలో శుక్రవారం సాయంత్రం శారదా అమ్మవారికి 22 రకాల సుష్కఫల (డ్రైఫూట్స్)తో అలంకారం చేశారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం డ్రై ఫ్రూట్స్‌తో అలంకారం చేశారు.

## దుస్తులు, పండ్లు పంపిణీ

పాలకొల్లు టౌన్, మార్చి 22: పాలకొల్లు అంజలీ మానసిక వికలాంగ పాఠశాలలో శుక్రవారం అందే జైపాల్ నాయుడు జన్మదిన సందర్భంగా విద్యార్థులకు దుస్తులు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ పి.ప్రసాదు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# ప్రపంచ జల దినోత్సవ ర్యాలీ



పాలకొల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాలకొల్లు అర్బన్, మార్చి 22 : ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినీలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ నీటి వినియోగం ఆవశ్యకతను, నీటి దుర్వినియోగాన్ని ఎలా అరికట్టాలి అన్న అంశాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవి శంకర్, రసాయనశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ స్వరూప్ సింగ్, విజయలక్ష్మి, డాక్టర్ పీవీ రమణ, పీవో నోబుల్ రాజు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడదాం

నరసాపురం రూరల్, మార్చి 22: భూమిపై ఉన్న నీటిని పొదుపుగా వాడినప్పుడే భవితరాలకు నీటిని అందించగలమని స్వర్ణాంధ్ర కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో నీటిని పొదుపుగా వాడాలంటూ బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్ ఫణికర్, నర్సింహరాజు, ఆనందబాబు, వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇటు వనితాక్లబ్ ఆధ్వర్యంలో నీటి ప్రాముఖ్యతపై బాలికల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి విచ్చేశారు.

**భీమవరం టౌన్:** మూడు శాతం జలాన్ని మాత్రమే ఉపయోగించుకుంటున్నామని, మిగిలిన జలం ఉప్పునీటిగానే సముద్రంలోకి పోతున్నదని పర్యావరణ శాస్త్రవేత్త, యూత్ హాస్టల్స్ నాయకులు డాక్టర్ మట్లపూడి సత్యనారయణ అన్నారు. సంస్కార్ స్కూల్లో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ చాలా చోట్ల జల ఇబ్బంది కూడా ఉందని, జలాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని, జలం కూడా పర్యావరణం అవుతుందని అన్నారు. ప్రిన్సిపాల్ ఎ.సత్యవతి, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.